క్లుప్తంగా

అబ్బిరెడ్డిస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే


అబ్బిరెడ్డిస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే సుధా

అట్లూరు : అట్లూరు క్రాస్ రోడ్డులో వెలసిన అవధూత అబ్బిరెడ్డి స్వామిని మంగళవారం బద్వేలు ఎమ్మెల్యే డాక్టరు సుధా దర్శించుకున్నారు. ప్రతి ఏటా దసరా పండుగను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆమె మంగళవారం స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ కార్పొరేషన్ డైరెక్టరు రొండా మల్లికార్జునరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ఆలయ చైర్మన్ రెడ్డెయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారిశాలలో కలెక్టర్ ప్రత్యేక పూజలు


కలెక్టర్, జేసీ, కమిషనర్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య వర్తక సంఘం సభ్యులు

బద్వేలు అర్బన్ : బద్వేలులోని అమ్మరిశాలవీధిలో గల వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం (అమ్మవారిశాల)లో జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, కడప కార్పొరేషన్ కమిషనర్ సూర్యసాయిప్రవీణ్‌చంద్ మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆర్యవైశ్య వర్తక సంఘం తరఫున నిర్వాహకులు సత్కరించి, అమ్మవారి చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, ఆర్యవైశ్య వర్తక సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు 'రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి' సమావేశం

ఖాజీపేట : మండల కేంద్రంలో రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి అనే అంశంపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9.30కు ప్రారంభమయ్యే సమావేశానికి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పార్టీ ముఖ్య నాయకులు హాజరుకావాలని తెలిపారు.

ఆస్పత్రి ప్రారంభం

దువ్వూరు : మండల కేంద్రంలోని అమ్మవారిశాలలో నూతనంగా నిర్మించిన శ్రీ తిరుమల ప్రైవేటు ఆస్పత్రిని సోమవారం రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల సదుపాయాలతో వైద్యశాలను నిర్మించడం సంతోషదాయకమన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని ఆస్పత్రి నిర్వాహకుడు డాక్టర్ తిరుమలరావుకు సూచించారు.

ఘనంగా శ్రీచక్రార్చన


శ్రీచక్రార్చన కార్యక్రమం నిర్వహిస్తున్న వేదపండితులు

బ్రహ్మంగారిమఠం : జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో మంగళవారం ఘనంగా శ్రీచక్రార్చనను నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ఈ కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం శమీ పూజోత్సవం వైభవంగా నిర్వహించారు. సోమవారం అమ్మవారు మహిషాశురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చి అభయమిచ్చారు. కార్యక్రమంలో మఠాధిపతి శ్రీవీరశివకుమారస్వామి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు, న్యాయ సలహాకమిటీ చైర్మన్ పేరుసోముల గురుప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ నందవీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

9న పురస్కారం


డీకే చదువుల బాబు

ప్రొద్దుటూరు : ప్రముఖ రచయిత, బాలసాహితీవేత్త, తెలుగు భాషోపాధ్యాయుడు డీకే చదువుల బాబు నవంబర్ 9న న్యూఢిల్లీలో జరిగే కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకోనున్నారు. ఈ విషయం తెలియజేస్తూ కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసరావు ఆహ్వానం పంపారు. చదువులబాబు రచించిన బాలల కథాసంపుటి 'వజ్రాలవాన' పురస్కారానికి ఎంపికైన విషయం తెలిసిందే.

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో కడప నగర శివార్లలో సంస్థ శిక్షణాలయంలో బుధవారం నుంచి నిరుద్యోగ మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజులపాటు శిక్షణ కొనసాగుతుందని, శిక్షణాకాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. ఆసక్తిగల వారు 94409 05478 సంప్రదించాలని కోరారు.

వైభవం.. శమీ దర్శనం

దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి శమీదర్శనం, గ్రామోత్సవం కనుల పండువగా సాగింది. ప్రొద్దుటూరు క్లస్టర్ పరిధిలోని ప్రొద్దుటూరు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాల్లో ఈ వేడుక ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తన్మయులయ్యారు.


బ్రహ్మంగారిమఠంలో స్వామి, అమ్మవారు, వారి పాత్రి ఊరేగింపు


బద్వేలు అర్బన్ : కన్యకాపరమేశ్వరిదేవి గ్రామోత్సవం


బి.కోడూరు : సగిలేరు ఒడ్డున వెలసిన దుర్గాంబదేవి

బద్వేలు అర్బన్ : దసరా మహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన శమీదర్శనం, గ్రామోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక నెల్లూరు రోడ్డులోని గోవిందయ్యమఠం ఆవరణలో గల జమ్మి వృక్షం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా కన్యకాపరమేశ్వరి ఆలయం (అమ్మవారిశాల), కోదండ రామాలయం, మహాలక్ష్మీదేవి ఆలయం, వీరభద్రస్వామి ఆలయంలోని అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక అమ్మవారిశాలలోని అమ్మవారును వెండిపల్లకీలో ఊరేగించారు. గ్రామోత్సవంలో భాగంగా అమ్మవారికి దారి పొడవునా భక్తులు కాయ, కర్పూరం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాలకు చెందిన అమ్మవారి విగ్రహాలను జమ్మివృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేయించి తిరిగి ఆలయాలకు చేర్చారు. మంగళవారం ఆర్యవైశ్యులు ఆనందోత్సాహాల నడుమ వసంతోత్సవ కార్యక్రమం నిర్వహించుకున్నారు. గ్రామోత్సవంలో భాగంగా భారీగా బాణసంచా పేలుస్తూ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆయా ఆలయ కమిటీల సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా గ్రామోత్సవం

కాశినాయన : మండలంలోని జ్యోతిక్షేత్రంలో విజయదశమి పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. అన్నపూర్ణేశ్వరిదేవి విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. డప్పు, మంగళవాయిద్యాలతో ఘనంగా ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

భవానీదేవి అలంకారంలో..


మైదుకూరు: అమ్మవారి గ్రామోత్సవం


కాశినాయన : జ్యోతిక్షేత్రంలో అన్నపూర్ణేశ్వరిదేవి గ్రామోత్సవం


దువ్వూరు: శ్రీ విజయలక్ష్మీదేవిగా కన్యకాంబ

కలసపాడు : స్థానిక వాసవీకన్యకాపరమేశ్వరీ ఆలయంలో సోమవారం అమ్మవారు భవానీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీకన్యకాపరమేశ్వరీ ఆలయంలో మంగళవారం అమ్మవారు విజయలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కలసపాడులోని పుల్లారెడ్డిపల్లె రోడ్డులోని అంకాలమ్మ గుడి వద్ద ఉన్న జెమ్మిచెట్టు వద్ద అమ్మవారి శమీదర్శనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహిళలు ప్రదర్శించిన అమ్మవారి వేషధారణలు ఆకట్టుకున్నాయి.

ముగిసిన ఉత్సవాలు

బి.కోడూరు : మండలంలో చెన్నకేశాపురం గ్రామ సమీపాన సగిలేరు ఒడ్డున వెలసిన శ్రీకోడూరు దుర్గాంబదేవి దసరా మహోత్సవాలు ఆలయ కమిటీ సభ్యులు బసిరెడ్డిదుగ్గిరెడ్డి, ఆలయ అర్చకులు అయిలావజ్జులరామకృష్ణశర్మ (బుజ్జిస్వామి)ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చివరి రోజైన సోమవారం విజయదశమి సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. అలాగే ఆలయ కమిటీ సభ్యులు కోలాటం తదితర సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సుమారు 14 జతల వృషభరాజులతో బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అలాగే మేకవారిపల్లె గ్రామ సమీపాన వెలసి ఉన్న శ్రీఅఖిలాండకోటి బ్రహ్మానంద ఆశ్రమంలో 108 శివలింగాలు, పంచముఖ ఆంజనేయస్వామి, శివపార్వతులను సుందరంగా అలంకరించడంతోపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నేత్రపర్వం.. ఉత్సవం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శమీపూజోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామిమఠంలో మాతా గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామికి విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తుల ఊరేగింపు చేపట్టారు. జగన్మాత శ్రీ ఈశ్వరీదేవి మఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగింపు ప్రారంభించారు. ఈ ఊరేగింపులో మాతా గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి, వారి మనువరాలు శ్రీ ఈశ్వరీదేవిని భక్తులు ఏక కాలంలో దర్శించుకుని ఆనందపరవశులయ్యారు. ఉత్సవమూర్తులను జమ్మివృక్షం దగ్గరికి తీసుకెళ్లి, ప్రదక్షిణలు చేయించారు. అనంతరం ఆలయాలకు తీసుకొచ్చారు. రాత్రి కలశోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో పెద్దమఠం పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగవసంత వెంకటేశ్వరస్వామి కుటుంబ సభ్యులు, చిన్నమఠం మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి, ఈఓ బీవీ జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే అమ్మవారిశాలలో విజయదశమి వేడుకలు, శమీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని జమ్మివృక్షం దగ్గరికి ఊరేగింపుగా తీసుకెళ్లి, ప్రదక్షిణలు చేయించారు.


మైదుకూరు: విజయలక్ష్మీదేవి అలంకారంలో వాసవీమాత


కలసపాడు : అమ్మవారి వేషధారణలో ఆర్యవైశ్య మహిళలు


ఖాజీపేట: కోలాట ప్రదర్శనలో ఆర్యవైశ్య మహిళలు


రాజుపాళెం: వెల్లాల గ్రామంలో కళాకారులు చేస్తున్న నృత్యం


రాజుపాళెం: బండెసేవ కార్యక్రమంలో భక్తులు

క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు క్రీడానైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జార్జికారొనేషన్ క్లబ్ అధ్యక్షుడు బాలగంగిరెడ్డి పేర్కొన్నారు. దసరా క్రీడా ఉత్సవాల సందర్భంగా క్లబ్‌లో జూనియర్స్, సీనియర్స్ బాలబాలికల విభాగంలో షెటిల్ పోటీలను నిర్వహించారు. సీనియర్ బాలికల విభాగంలో విన్నర్‌గా సభాటిన్, రన్నర్‌గా క్రితి, బాలుర విభాగంలో విన్నర్‌గా ఈశ్వరప్రసాద్, రన్నర్‌లుగా వర్షిత్ నిలిచారు. జూనియర్ విభాగంలో బాలుర విభాగంలో విన్నర్‌గా నంద కిశోర్, రన్నర్‌గా హర్షిత్, బాలికల విభాగంలో విన్నర్‌గా పద్మ, రన్నర్‌గా ధన్య, సబ్ జూనియర్ బాలుర విభాగంలో విన్నర్ చరణ్‌తేజ్‌రెడ్డి, రన్నర్‌గా అద్విక్ నిలిచారు. గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు. క్లబ్ సెక్రటరీ గంగిరెడ్డి, జాయింట్ సెక్రటరీ శివారెడ్డి, కోచ్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం

బ్రహ్మంగారిమఠం : సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు, న్యాయసలహా కమిటీ చైర్మన్ పేరుసోముల గురుప్రసాద్ తెలిపారు. బ్రహ్మంగారిమఠంలోని శ్రీ విరాట్ విశ్వకర్మ భవన్‌లో డార్మెంటరి హాల్‌ను శ్రీవీరబ్రహ్మేంద్రస్వామిమఠం పూర్వపు మఠాధిపతి కుమారుడు శ్రీవెంకటాద్రిస్వామి, జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠం మఠాధిపతి శ్రీశివకుమారస్వామి, తోట్లపల్లె అచలానందస్వామి ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి భక్తులు చేయి చేయి కలిపి మఠాన్ని, యాత్రికులకు సౌకర్యాలను అభివృద్ధి చేయాలని తెలిపారు. అనంతరం హనుమంతరావు, గురుప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే చాలా అభివృద్ధి చేశామని, ఇంకా చేస్తామని పేర్కొన్నారు. ఇందుకు భక్తులు, దాతలు, విశ్వబ్రాహ్మణులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి దువ్వూరి నరసింహాచారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ నందవీరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


డార్మెటరి హాల్‌ను ప్రారంభిస్తున్న స్వామీజీలు

అట్టహాసంగా బండలాగుడు పోటీలు


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీలు

బ్రహ్మంగారిమఠం : దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని పలగురాళ్లపల్లె పంచాయతీ జి.కొత్తపల్లె సమీపంలోని కోడూరు దుర్గాదేవీ, బి.మఠంలోని అమ్మవారిశాల, ఈశ్వరీదేవి మఠం, బ్రహ్మంగారి మఠం తదతర దేవలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు. మంగళవారం కోడూరు దుర్గాదేవి ఆలయంలో నిర్వాహకులు బండలాగుడు పోటీలను నిర్వహించారు. పోటీలలో మొదటి బహుమతి పొందిన వృషభరాజములకు రూ. 80వేలు జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి అందజేశారు. రెండవ బహుమతి రూ. 60వేలు జౌకుపల్లెకు చెందిన బసిరెడ్డి జయరామిరెడ్డి కుమారులు, మూడవ బహుమతి రూ.50వేలు సింగల్ విండో చైర్మన్ సుబ్బారెడ్డి, నాల్గువ బహుమతి రూ. 40వేలు బసిరెడ్డి కుమారులు, ఐదవ బహుమతి రూ.30వేలు సర్పంచ్ చిన్న ఓబుల్‌రెడ్డిలు విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, ఆలయ చైర్మన్ బసిరెడ్డి రామకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పార్కులో సందర్శకుల సందడి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని 45వ డివిజన్ పరిధిలోని చెమ్ముమియ్యాపేటలోని భగత్‌సింగ్ పార్క్ మంగళవారం సందర్శకుల తాకిడితో కిటకిట లాడింది. దసరా పండుగ కావడంతో పాటు విద్యార్థులకు సెలవులు కావడంతో ప్రజలు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి పార్కులో బంధు మిత్రులతో సరదాగా గడిపారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన ఆట వస్తువులతో చిన్నారులు ఆడుకుంటూ సందడి చేశారు.



శిల్పారామంలో ..

కడప కల్చరల్ : దసరా పండుగను పురస్కరించుకుని శిల్పారామంలో దసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం చిత్తూరు బైరెడ్డిపల్లెకు చెందిన కళాతరింగిణి బృందం సభ్యులు దసరా పండుగ విశిష్టతలను తెలిపే పలు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.

పెద్దదర్గాలో ముస్లిం ఐక్యవేదిక సభ్యులు

కడప కల్చరల్ : ముస్లిం ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ సభ్యులు మంగళవారం అమీన్‌పీర్ (పెద్ద)దర్గాను దర్శించుకున్నారు. దర్గా ముజావర్ అమీర్ వారికి స్వాగతం పలికి ప్రధాన గురువుల మజార్ వద్ద అనంతరం, ఆ ప్రాంగణంలోని ఇతర గురువుల మజార్ల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. ఫాతెహా నిర్వహించి ప్రసాదాన్ని అందజేశారు. ఐక్యవేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్, జియావుల్ రెహ్మాన్, జాఫర్ వలీ, సయ్యద్ ఖలీల్, నూర్, గుంటూరు సలావుద్దీన్, కలాం, జావిద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఏకలవ్య సేవలు విస్తృత పరచాలి

కడప ఎడ్యుకేషన్: ఏకలవ్య ఫౌండేషన్ సేవలు, కార్యక్రమాలు మరింత విస్తృతంగా చేయాలని, గ్రామీణ ప్రాంత విద్యార్థులలో నైపుణ్యం వెలికితీసే విధంగా ఉండాలని ఫౌండేషన్ గౌరవ సలహాదారు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కడప మారుతీనగర్‌లోని ఏకలవ్య ఫౌండేషన్ కార్యాలయంలో జిల్లాస్థాయి విద్యా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలలలో అమలు జరిపిన నెలవారి విద్యా కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించడంతోపాటు భవిష్యత్తు కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ట్రస్టీ ప్రతినిధి చలపతి, విద్యా కమిటీ చైర్మన్ బాలకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశీలకుడు సతీష్, జిల్లా విద్యా సమన్వయ కర్తలు నరేష్, బాలాజీ, కమిటి సభ్యులు బాలాజీ, నరసింహులు, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

కడప ఎడ్యుకేషన్: జేకే వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో అమ్మవారి భక్తులకు నీళ్లు, మజ్జిగ, సమోసాలను పంపిణీ చేశారు. విజయదశమి పురస్కరించుకుని అమ్మవారి ఊరేగింపు సందర్భంగా భక్తులకు జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పటాన్ ఖాదర్‌బాష ఆధ్వర్యంలో సేవలు అందచేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రఫీ, సుబ్బరాయుడు, ఖదీర్, సలీం తదితరులు పాల్గొన్నారు.

మధురై ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

కడప కోటిరెడ్డి సర్కిల్ : మధురై–ఓఖా మధ్య నడుస్తున్న మధురై ఎక్స్‌ప్రెస్ (09519)ను దారి మళ్లించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల ఈనెల 27వ తేదీ నుంచి ఈ రైలును దారి మళ్లించారన్నారు. ఈ రైలు రేణిగుంట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి మీదుగా నడవాల్సి ఉండగా.. కాట్పాడి, పాకాల, ధర్మవరం, గుత్తి మీదుగా ఓఖాకు నడుస్తుందన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు.

ప్రయాణికులతో రైళ్లు కిటకిట

కడప కోటిరెడ్డిసర్కిల్ : దసరా పండుగ ముగిసిన తరుణంలో వివిధ ప్రాంతాలకు వెళుతున్న ప్రయాణికులతో రైళ్లు కిటకిటలాడుతున్నాయి. రైల్వేశాఖ ప్రయాణికులకు తగినట్లుగా స్పెషల్ రైళ్లను నడపకపోవడంతో ఉన్న వాటిలోనే ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. ముఖ్యంగా దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు రైలు ప్రయాణానికి మొగ్గుచూపుతున్నారు.

ఎమ్మెల్యే రాచమల్లు దాతృత్వం

హోటల్ కార్మికుడికి రూ.లక్ష ఆర్థిక సహాయం

ప్రొద్దుటూరు : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న బిస్మిల్లా హోటల్ నిర్వాహకుడు షేక్ రంతుబాషాకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోమవారం ఆర్థిక సహాయం అందించారు. కుష్కా హోటల్ నిర్వహిస్తున్న రంతుబాషాకు ఈ ఏడాది జూలై నెలలో గుండె పోటు రావడంతో ఆపరేషన్ చేయించుకున్నాడు. అప్పటి నుంచి హోటల్ తెరవకపోవడంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాచమల్లు హోటల్ దగ్గరకు వెళ్లి రంతుబాషా జీవనం కోసం రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్ జిలాన్ తదితరులు పాల్గొన్నారు.


షేక్ రంతుబాషాకు రూ.లక్ష అందిస్తున్న ఎమ్మెల్యే

పేదలు పస్తులు ఉండకూడదనే రాజన్న భోజనం

పండుగ రోజున పేదలు పస్తులు ఉండకూడదనే ఉద్దేశంతోనే దసరా సందర్భంగా కూడా రాచమల్లు రాజన్న భోజనం క్యాంటిన్ నిర్వహించామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రాజన్న భోజనం క్యాంటిన్‌లో వచ్చిన వారికి భోజనం వడ్డించారు.

'బండినరవ' ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లాలి

పోరుమామిళ్ల : బండినరవ ఆధ్యాత్మిక, ధార్మిక కేంద్రంగా విరాజిల్లాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆకాంక్షించారు. పోరుమామిళ్ల నుంచి టేకూరుపేటకు వెళ్లే దారిలో బండినరవ వద్ద భారీ స్థాయిలో వివిధ ఆలయాల నిర్మాణం చేపట్టేందుకు ఏర్పాటు చేసిన వసతి భవనాలకు ఆయన సోమవారం రాత్రి ప్రారంభోత్సవం చేశారు. అంతకు ముందు ఆలయాల కమిటీ అధ్యక్షుడు పంగా గురివిరెడ్డి, యువ నాయకుడు ఆదిత్యారెడ్డితో కలసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వసుధైక కుటుంబం అంటే ప్రపంచంలోని అన్ని దేశాలు కలసి ఉండటమేనని, వివిధ దేశాల నుంచి వచ్చిన వివిధ మతాలు, సంస్కృతుల వారిని భారతదేశం అక్కున చేర్చుకుందని తెలిపారు. భారతదేశంలో పుట్టడం మనం చేసుకున్న పుణ్యమని, వరమని అన్నారు. భారతదేశం ప్రపంచ గురువుగా ఉందన్నారు. బండి నరవలో నిర్మించ తలపెట్టిన వివిధ ఆలయాలు, వివిధ పనులతో జిల్లాలో గొప్ప పర్యాటక స్థలంగా రూపుదిద్దుకోవాలన్నారు. అందుకు తన వంతు ఆర్థిక సహకారంతోపాటు ప్రధాన భాగస్వామిగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కల్లూరి రమణారెడ్డి, సర్పంచులు కె.రమణారెడ్డి, జనార్ధనరెడ్డి, 108 శివలింగాల దాతలు, జనహిత కార్యకర్తలు, ఆలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

గాంధీజీ కలలు జగన్‌తో సాకారం

చింతకొమ్మదిన్నె : మహాత్మా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి, జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రసూల్‌పల్లి గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్బీకే కేంద్రం భవనాలను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, సర్పంచ్ స్వాతి, నాయకులు నీలకంఠారెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉన్న ఊరిలోనే సౌకర్యాలు

వీరపునాయునిపల్లె : ప్రజలకు ఉన్న ఊరిలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సౌకర్యాలు కల్పిస్తున్నారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గంగిరెడ్డిపల్లెలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య ఉప కేంద్రం, మినరల్ వాటర్ ప్లాంటు భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు తిరుపాల్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, స్థానిక నాయకులు కిషోర్‌రెడ్డి, శ్రీనివాసుల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, చైతన్య కుమార్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, ప్రతాప్ యాదవ్, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కమలాపురం : బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పరామర్శించారు. కమలాపురానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఓ.జాషువా పీటర్ ఈ నెల 11వ తేదీన గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం మృతుడి నివాసంలో జరిగిన సంతాప సభకు ఎమ్మెల్యే హాజరయ్యారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు.